## ప్లాట్ కోసం పంచాయితీ ఇద్దరికి గాయాలు

బండ్లగూడ, మే 19: ఓ ప్లాట్ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం అత్తాపూర్ పోలీస్టేషన్ పరిధిలోని పిల్లర్ నంబర్ 226 దగ్గర జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన ఇద్దరిని దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆస్తి తగాదాల వల్లనే ఇద్దరి మధ్య గొడవ జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసు నమోదు చేసుకోని పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఎర్రగడ్డ, మే 19: బోరబండ స్వరాజ్‌నగర్‌లోని హరిహర క్షేత్ర దేవస్థానంలో నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఉత్సవాలకు హరిహర క్షేత్రంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. తొలి రోజు పూజలతో పాటు ఎదుర్కోళ్లు, విష్ణు సహస్రనామ పారాయణం, మంగళవారం స్వామి వారి కల్యాణం, గరుడసేవ, పుర వీధుల్లో ఊరేగింపు ఉత్సవం ఉంటాయని. బుధవారం సుదర్శన హోమం, స్వామివారికి అభిషేకం, పూజల అనంతరం సాయంత్రం 6 గంటలకు ఉత్సవాలు ముగుస్తాయని దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కల్వల సత్యనారాయణరావు పేర్కొన్నారు. ఉత్సవాలకు భక్తులందరూ విచ్చేయాలని ఆయన కోరారు.



బంజారాహిల్స్ రోడ్ నం 2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ నుంచి ఇందిరానగర్ వెళ్లేదారిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు



జవహర్‌నగర్‌లో అన్నపూర్ణ స్టూడియో ఎదురుగా కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

# ఇదేం చెత్త సేకరణ

ఎటుచూసినా చెత్తకుప్పలే..

- వ్యర్థాల తరలింపులో నిర్లక్ష్యం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

బంజారాహిల్స్, మే 19: జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో చెత్తతరలింపులో జాప్యం స్థానికులను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్, షేక్‌పేట డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపక్కన భారీగా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు పేరుకుపోయిన చెత్త తరలింపులో జీహెచ్ ఎంసీ శానిటేషన్ విభాగం చేస్తున్న ఆలస్యం కారణంగా తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది.

### ఆరునెలల్లో మారిన ఏఎంవోహెచ్‌లు

చెత్త తరలింపును పర్యవేక్షించాల్సిన శానిటేషన్ విభాగం అధికారులు ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో అనుకున్న సమయంలో చెత్తను తొలగించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కిల్ –18లో ఆరు నెలల్లో ఇద్దరు ఏఎంవోహెచ్‌లు మారడం, కొత్తగా వచ్చిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కేవలం హోటళ్లు, ఫుట్‌పాత్ వ్యాపారాలపై దృష్టి పెడుతుండడంతో వీఐపీ జోన్‌లో చెత్త సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రోజుకు ఒకసారే చెత్త తొలగింపు..

ఇదిలా ఉండగా మరికొన్ని ప్రాంతాల్లో రోజుకు ఒకసారే చెత్తను తొలగిస్తుండడంతో సాయంత్రం అయ్యే సరికి తిరిగి గుట్టలుగా వ్యర్థాలు పేరుకు పోతున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. వేలాదిగా ఉన్న జనాభాకు అనుగుణంగా రోజుకు రెండు సార్లు చెత్తను తొలగించాలని స్థానికులు ఈ సందర్భంగా పేర్కొంటున్నారు. బంజారాహిల్స్ రోడ్ నం–2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ నుంచి ఇందిరానగర్‌కు వెళ్లేరోడ్డులో పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇక అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాల స్టూడియో ముఖద్వారం సమీపంలో చెత్త కుప్పలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోని శానిటేషన్ విభాగం అధికారులు ఈ సమస్యలపై దృష్టిపెట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నిరుపయోగంగా వేగనియంత్రణ సూచిక బోర్డు

బంజారాహిల్స్, మే 19: అతివేగంతో వెళ్లే వాహనదారులను కట్టడి చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రయోగాత్మక విధానాలు కొత్త ప్రభుత్వంలో నీరుగారుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నం–2లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ రోడ్డులో అత్యంత వేగంగా వాహనాలు వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని గుర్తించిన ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఈ రోడ్డుపై వేగనియంత్రణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ రోడ్డులో ఎలక్ట్రానిక్ స్పీడ్ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. రోడ్డు మీద వెళ్తున్న వాహనాల వేగాన్ని లెక్కించే ఈ డిస్‌ప్లేలో నమోదవుతున్న వేగాన్ని ట్రాఫిక్ విభాగం సీసీ కెమెరాలతో అనుసంధించాలని గతంలో అధికారులు వీటిని ఏర్పాటు చేశారు. నాలుగైదు నెలలు బాగానే పనిచేసిన ఈ డిస్‌ప్లే.. ఇటీవల పనిచేయడం మానేసింది. దీని నిర్వహణపై ఎవరూ దృష్టి పెట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది.




బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్‌లో నిరుపయోగంగా మారిన డిస్‌ప్లే బోర్డు

## రోడ్డు ప్రమాదంలో బీహార్ వాసి మృతి

బండ్లగూడ, మే 19: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. అత్తాపూర్ పిల్లర్ నంబర్ 150 వద్ద ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడిని బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ స్థలం కబ్జా యత్నం

ఎర్రగడ్డ, మే 19: ప్రభుత్వ స్థలాన్ని కబ్జాకు యత్నం చేసిన ఓ వ్యక్తిపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజేత థియేటర్ ఎదురుగా(సారథినగర్) ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ కుషాల్‌రాజ్ అనే వ్యక్తి ఆదివారం ఫెన్సింగ్ వేస్తున్నాడు. ఖైరతాబాద్ తహసీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ వెళ్లి కుషాల్‌రాజ్‌ను అడ్డుకున్నారు. ఫెన్సింగ్ పనులు నిలిపివేశారు. నకిలీ పత్రాలతో స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాడని కుషాల్‌రాజ్‌పై అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## మరోసారి ఫుట్‌పాత్‌ను తవ్వేస్తున్నారు

- శాఖల మధ్య సమన్వయ లేమితో ప్రజాధనం వృథా

బంజారాహిల్స్, మే 19: బంజారాహిల్స్ రోడ్ నం–2లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ దాకా కేబీఆర్ పార్కు చుట్టూ వేసిన పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌ను మరోసారి తవ్వేస్తున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో ఆరు నెలల క్రితం కేబీఆర్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్ నిర్మించారు. ఫుట్‌పాత్ నిర్మించిన కొన్ని రోజులకే కేబుళ్ల కోసం అంటూ గతంలో తవ్వేశారు. ఆ మరమ్మతులు పూర్తిచేసి రెండు మూడు నెలలు కూడా గడవక ముందే మరోసారి ఇలా తవ్వేస్తున్నారు. శాఖల మధ్యన సమన్వయం కొరవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం రోడ్డు పాలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కేబీఆర్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌ను తవ్వేస్తున్న దృశ్యం

## వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి

- వాహనాల మితిమీరిన వేగంతో ప్రమాదాలు
- వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

అత్తాపూర్, మే 19: ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో పాదచారులు, సీనియర్ సిటిజన్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు రయ్యిమంటూ దూసుకుపోతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతన్నాయి. ఎన్నో సార్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధిరరులకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని చెప్పినా పట్టించుకోవడం లేదని అత్తాపూర్ ప్రజలు వాపోతున్నారు. అత్తాపూర్, హైదర్‌గూడ, నందిముస్లాయిగూడ, హుడకాలనీ లాంటి జనసాంద్రత ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో మైనర్లు ఎక్కువగా వాహనాలు నడుపుతుంటారు. లంగర్‌హౌస్ బాపుఘాట్ బిడ్జి నుంచి హైదర్గూడకు వెళ్లే రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల వేగం ఎక్కువగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని హైదరగూడ ప్రజలు చెబుతున్నారు. కొన్ని కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు సొతంతంగా ప్రమదాలు జరగకుండా స్పీడ బ్రేకర్లను నిర్మించుకున్నారు. ప్రధానంగా హైదర్‌గూడ నుంచి ఎర్రబోడాకు వెళ్లే రహదారిపై ప్రతిరోజు రోడ్డు ప్రమదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు పక్కనే అపార్టుమెంట్లు, స్కూల్స్ ఉండంతో వాహనాల వేగానికి రోడ్లపైకి రావాలంటేనే జనం భయపడతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే కొంతైనా ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకొని ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న కాలనీల పరిసరాల్లో స్పీడ్ బ్రేకర్లను వేయాలని అత్తాపూర్ ప్రజలు కోరుతున్నారు.



హైదర్‌గూడ జనప్రియ ప్రధాన రహదారిపై వేగ నియంత్రణ సూచికలు లేని దృశ్యం

## నీటి సమస్యలు లేకుండా చర్యలు

### జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్

జూబ్లీహిల్స్, మే 19: తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జలమండలి డివిజన్–6 జీఎం ఎస్.హరిశంకర్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్ ఎస్పీఆర్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వాటర్ ప్రెషర్, క్లోరిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికీ తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లోప్రెషర్, కలుషిత నీటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. వేసవితో పాటు అకాల వర్షాలతో తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఆర్ హిల్స్ సెక్షన్ మేనేజర్ రాజేందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



నీటిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలిస్తున్న జీఎం హరిశంకర్

## యువకుడు అదృశ్యం



ఎర్రగడ్డ, మే 19: అన్న యింటికి వచ్చిన తమ్ముడు టాబ్లెట్లు తెచ్చుకుంటానని బయటకు వెళ్లి తప్పిపోయిన సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దశరథ్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి బోరబండ ప్రభాత్‌నగర్‌లో ఉంటున్నాడు. నిజామాబాద్ జిల్లా నాగారంలో ఉండే దశరథ్ తమ్ముడు సాయిలు(32) తన అన్న దశరథ్ ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం 10 గంటలకు టాబ్లెట్లు తెచ్చుకుంటానని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. తమ్ముడి ఆచూకీ లభించకపోవటంతో దశరథ్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## బాలమురుగన్ విగ్రహ ప్రతిష్ఠాపన



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో బాలమురుగన్ కుమారస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం జరిగింది. తమిళ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట స్వామి అధ్యక్షతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో మొదటి రోజు స్వామివారి ఊరేగింపు, రెండోరోజు హోమాలు చేసి మూడోరోజు విగ్రహ ప్రతిష్ఠాపన చేసి.. డాక్టర్ ఎం.మురళీధరన్ వివాదియార్, డాక్టర్ ఎన్.రాజు సమక్షంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో నాయకులు, తమిళ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కోట స్వామి, ఉపాధ్యక్షుడు ఆర్.గణేశన్, జనరల్ సెక్రటరీ కె.చిన్నస్వామి, ట్రెజరర్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ ఎస్.ఆనందం, తమిళ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- జీడిమెట్ల



వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి విచ్చేసిన విశ్వశిఖర నాట్యాలయ భరతనాట్య గురువులు మీనా, కృష్ణప్రియ తమ శిష్య బృందంతో కలిసి నర్తించారు. - కొండాపూర్



వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో బాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం కుమారి అంజలి పెనుగొండ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో అలరించింది. తాండవ నృత్యకారి మూషిక వాహన, రుక్మిణి ప్రవేశం, బ్రహ్మాంజలి, పలుకే పంగారమాయెనే, పుష్పాంజలి, అలివేలు మంగ, కులుకగ నడవరో, నమశ్శివాయతే, గోవర్ధన గిరిధర, జతిస్వరం, చక్కని తల్లికి చాంగ్ భళా, కృష్ణ శబ్దం, గోవిందా గోవిందా అంశాలను నటీమణులు నిధి, సుధేష్ణ, వంశిక, సిరి, తనూజ, అనన్య, స్నికిత, కీర్తి మొదలైన వారు ప్రదర్శించారు. – ఉప్పల్



మహిళలకు శానిటేషన్ సిబ్బందితో కలిసి అవగాహన కల్పిస్తున్న పొదుపు సంఘాల మహిళలు

## రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు

జూబ్లీహిల్స్, మే 19: రోడ్డుపై చెత్త వేస్తే మహిళా సంఘాల సభ్యులు పట్టుకుంటారని.. రోడ్లపై వ్యర్థాలు వేసే వారు జరిమానా కట్టక తప్పదని యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు పేర్కొన్నారు. ప్రతిఇంటి నుంచి చెత్తను స్వచ్ఛ ఆటోల కార్మికులకే ఇవ్వాలని అన్నారు. రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో జీహెచ్‌ఎంసీ శానిటేషన్, పొదుపు సంఘాల మహిళలతో శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. చెత్త రోడ్లపై వేస్తే రూ.10వేల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు.




అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలిలో విగ్రహ పరిరక్షణ కమిటీ నాయకులు

## అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి

ఎర్రగడ్డ, మే 19: అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మోతీనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ పరిరక్షణ కమిటీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత బొట్టుశివతో పాటు పలువురు బాబాసాహెబ్ విగ్రహ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో అలంకరించారు. బొట్టుశివతో పాటు కమిటీ నేతలు జైభీమ్ యాదగిరి, గోపాస్ ధశరథ్, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

### స్టార్ హాస్పిటల్స్, అమీర్‌పేట కమ్మ సామాజిక సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

జూబ్లీహిల్స్, మే 19: ప్రతి ఒక్కరికీ తమ ఆరోగ్యంపై అవగాహన అవసరమని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని స్టార్ హాస్పిటల్ వైద్య నిపుణులు సూచించారు. బంజారాహిల్స్ స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అమీర్‌పేట్‌లోని కమ్మ సామాజిక సంఘం సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్టార్ హాస్పిటల్స్ ద్వారా అవసరమైన వారికి ఉచితంగా ఆరోగ్య అవగాహన, స్క్రీనింగ్ వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో, లివర్, జనరల్ మెడిసిన్, న్యూరో సైన్సెస్, నెఫ్రాలజీ, ఆంకాలజీ, ఆర్థోపెడిక్స్, పల్మనాలజీ విభాగాల సూపర్ స్పెషలిస్ట్ వైద్య నిపుణులతో ఉచిత కన్సల్టేషన్ సేవలందించారు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), ర్యాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్) తనిఖీ, బ్లడ్ ప్రెజర్ (బీపీ) పర్యవేక్షణ వంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈసీజీ, కార్డియాలజిస్ట్ సలహా ప్రకారం 2డీ ఎకో, ఆడియోమెట్రీ, ఫైబ్రో స్కాన్, బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ) పరీక్ష, 40 ఏండ్లు పైబడిన మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు, పురుషులు, మహిళలు, ధూమపానం చేసేవారికి ఓరల్ క్యాన్సర్ కోసం స్క్రీనింగ్‌లతో పాటు శ్వాసకోస ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి పల్మనాలజిస్టల సిఫారసుల ఆధారంగా స్పిరోమెట్రీ పరీక్షలు కూడా నిర్వహించారు. సాగర్ హాస్పిటల్స్ నిరంతరం ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణలో నిబద్ధతతో సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో 1200 మందికి పైగా పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు, మందులు, కన్సల్టేషన్, సలహాలు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సీఓఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ అనూష (ఆంకాలజీ), డాక్టర్ జ్యోత్స్న (నెఫ్రాలజిస్ట్), డాక్టర్ రామాంజనేయులు (గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్), డాక్టర్ నిహారిక (న్యూరాలజిస్ట్), డాక్టర్ కిషోర్ (ఈఎన్‌టీ), డాక్టర్ అనూరాధ (పల్మనాలజిస్ట్) తదితరులు పాల్గొన్నారు.